క్లుప్తంగా

వినాయక ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

కారంచేడు: మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించే వినాయక ఉత్సవాలకు పోలీస్ శాఖ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. గురువారం మండల కేంద్రమైన కారంచేడు పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు కమిటీ సభ్యులు వెబ్‌సైట్ నుంచే అనుమతి పొందాలన్నారు. అనుమతికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్‌లో అర్జీ పెట్టుకుంటే సమీప పోలీస్ అధికారి మండల స్థలాన్ని పరిశీలించి ఎలాంటి అభ్యంతరం లేకుంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌ఓసీ జారీ చేస్తారన్నారు.

యాప్‌తో అనుమతులు

అద్దంకి రూరల్: వినాయకచవితి సందర్భంగా అద్దంకి, పరిసర గ్రామాల్లో ఏర్పాటు చేసే పందిర్ల ఏర్పాటుకు నిర్వాహకులు పోలీస్ యాప్ ద్వారా అనుమతులు పొందవచ్చని సీఐ సుబ్బరాజు తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పోలీస్ యాప్‌లో కమిటీ సభ్యులు, పూర్తి వివరాలు పొందుపరచాలన్నారు. ఆ వివరాలను పోలీస్ స్టేషన్‌లో అప్‌లోడ్ చేస్తే అనుమతి పొందవచ్చని వివరించారు. యాప్‌లో తెలియని వారు స్టేషన్‌కువచ్చి వివరాలు పూర్తి చేసుకోవాలన్నారు. వినాయక చవితి వేడుకల్లో గొడవలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని కోరారు.

క్షయ వ్యాధి ప్రమాదకారి



కర పత్రాలను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

అద్దంకి: ప్రతి ఒక్కరికీ క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని టీబీ సూపర్‌వైజర్ ఎస్. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం క్షయ వ్యాధిపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమం ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సీ, జీవ శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్జీల పరిశీలన పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

ఇంకొల్లు(చినగంజాం): అన్నదాత సుఖీభవ అర్జీల పరిశీలన త్వరితంగా పూర్తి చేయాలని తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ అర్జీలకు సంబంధించి వ్యవసాయాధికారి ఎన్. మేరిమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి మొత్తం 1870 అర్జీలు అందాయని వాటిలో 1721 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. డీటీ లక్ష్మీకుమారి, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ మెటీరియల్ అందిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం: విద్యార్థులు చదువుతో పాటు జనరల్ నాలెడ్జ్ పై పట్టు సాధిస్తే ఉన్నత చదువుల్లో రాణించవచ్చని ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజిని పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో 300 మంది విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతున్న క్లాస్ పుస్తకాల తోపాటు ఇతర అన్ని రంగాలకు సంబంధించిన అంశాలతో ప్రత్యేకంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు స్వయంగా తయారు చేయించారని తెలిపారు. ఈ ప్రత్యేక మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగించు కొని చదువుల్లో రాణించాలని సూచించారు. జయంతి, ఏవీ సుబ్బారావు, నీలిమ, పోతురాజు, బ్రహ్మనంద రెడ్డి, గురుమని పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌కు టెండర్లు

చీరాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రెస్టారెంట్ అండ్ బార్‌ల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్‌ను అనుసరించి గురువారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో ఔత్సాహికులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. రియల్ ఎస్టేట్, రిసార్ట్‌ల నిర్వాహకులతో మాట్లాడారు. ఆసక్తి ఉన్న వారు టెండర్లు వేయాలని, లాటరీ పద్ధతిలో ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. రెస్టారెంట్ అండ్ బార్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గణేశా.. పర్యావరణ హిత!

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో నీరు కలుషితం
- జలచరాలకు హాని తప్పదు
- జిల్లాలో వేలాది విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు
- ఈ నెల 27న వినాయక చవితి పండుగ
- మట్టి విగ్రహాలే మేలంటున్న పర్యావరణ ప్రేమికులు



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహం



ముచ్చటగా ఉన్న మట్టి విగ్రహం

అద్దంకి: విఘ్నాలను తొలగించే స్వామి..సకల కోటి ప్రణామాలు అందుకొనే గణపతికి తొలిపూజ చేస్తే సకల శుభాలూ కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ నెల 27న వినాయక చవితి పురస్కరించుకొని భక్తులు వినాయక మండలపాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. భారీ వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు సమాయత్తమవుతున్నారు. అయితే పూర్వం మట్టితో చేసిన చిన్న గణపయ్యలను పూజించి.. చిన్నపాటి కుంటల్లో నిమజ్జనం చేసి ఆశీస్సులు పొందేవారు. కానీ కాలక్రమంలో పెను మార్పులు వచ్చాయి. వినాయక చవితి రోజు ఏర్పాటు చేసే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు పర్యావరణానికి విఘాతం కలిగించడం విచారకరం. ప్రతి ఏటా జిల్లాలోని 25 మండలాల్లో భారీ వినాయక విగ్రహాల ఏర్పాటు చేయడం పరిపాటిగా మారింది. ఈ సంవత్సరం సుమారు 2500 నుంచి 3వేల వరకు విగ్రహాలను జిల్లాలో ఏర్పాటు చేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. చీరాల, అద్దంకి, రేపల్లె, బాపట్ల తదితర పట్టాణాలల్లో తయారు చేసిన విగ్రహాలు నెల రోజుల ముందు నుంచే అమ్మకాలకు సిద్ధం చేశారు. వేలాది రూపాయలు వసూలు చేయడమే ధ్యేయంగా ఉన్నారు కానీ.. ప్రకృతికి ఎలాంటి నష్టం జరుగుతుందో ఎవరూ పట్టించుకోవడంలేదు.

రసాయనాలతో విషతుల్యం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) అనేది క్యాల్షియం సల్ఫేట్, హెమీ డైహైడ్రేట్‌తో చేసిన పొడి, దీన్ని నీటితో కలిపి విగ్రహాలు తయారు చేస్తారు. ఇందులో వాడే రంగులు నీటిలో కలిసి నీటి కాలుష్యాన్ని కలిగిస్తున్నాయి. నేడు వినాయక చవితి పందిళ్లలో వాడే విగ్రహాలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేస్తున్నారు. ఇవి నీటిలో కరిగిన తరువాత, కలుషితం అవుతున్నాయి. ఆ నీరు తాగిన జలచరాలు చనిపోవడం, వివిధ రకాల రోగాలు వ్యాపించడం సాధారణంగా మారింది. పీఓపీ విగ్రహాల వలన అనర్థాలు కలుగుతున్నాయని, మట్టి విగ్రహాలనే వాడాలని పార్యవరణ వేత్తలు కోరుతున్నారు. పలు చోట్ల మట్టి విగ్రహాలను తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

రుణాల సద్వినియోగంతో పురోగతి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్ నిర్వహించాలని ఏపీఎం కె.మధుసూదనరావు సూచించారు. గురువారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా పొదుపు సంఘాల మండల సమాఖ్య వీఏవోలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గూపు విధిగా ప్రతినెలా 10వ తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూలు చేయాలన్నారు. సూర్య ఘర్ పథకాన్ని పొదుపు సభ్యులకు వివరించి సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలన్నారు. ప్రతి గ్రూపు తీసుకున్న రుణాలను కేవలం స్వయం సహకారం పెంపొందించుకునే సంస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామ పొదుపు సంఘాల్లో మహిళలు విధిగా నెలవారీ వాయిదాల రుణాల చెల్లింపులో అలసత్వం వహించకూడదన్నారు. ఉన్నతి పథకంలో రుణాలు తీసుకున్న పొదుపు మహిళలు విధిగా రుణాలు చెల్లించాలని, పెండింగ్‌లో లేకుండా గ్రూపు లీడర్లు కృషి చేసేలా వీఏవోలు ప్రతి గ్రూపును పరిశీలించాలని కోరారు. మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

బల్లికురవ: ఖరీఫ్‌లో సాగు చేసిన వివిధ పైర్లకు ఆగస్టు 31లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయాధికారి బి. శ్రీనివాసరావు తెలిపారు. ఇ- పంట నమోదుతో మీ సేవా, కామన్ సర్వీస్ సెంటర్లలో మిర్చికి రూ. 4,500, కందికి రూ. 4030, పత్తి రూ. 400 చెల్లించాల్సాలన్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలతో నిఘా



కారంచేడులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కారంచేడు: గ్రామాల్లో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్ఐ ఖాదర్‌బాషా గురువారం తెలిపారు. ప్రస్తుతం వినాయక ఉత్సవాలు జరిగే అవకాశాలున్న ప్రాంతాల్లో ఈ కెమెరాల నిఘాను మరింత ఎక్కువగా చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నిఘా వ్యవస్థను కమిటీ సభ్యులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే మైక్‌లకు, లైటింగ్ కోసం ఏర్పాటు చేసే వైర్లు కూడా అతుకులు లేకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. వర్షాలు పడే అవకాశాలున్నాయని, తడి చేతులతో ఎవరూ కరెంట్ వైర్లను తాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

టూవీలర్ ప్రయాణాలకు హెల్మెట్ తప్పనిసరి



ప్రయాణికులకు సూచనలు ఇస్తున్న ఎస్సై వినోద్‌బాబు

జె.పంగులూరు: మండల పరిధిలోని అలవలపాడు క్రాస్ రోడ్డు వద్ద గురువారం టూవీలర్ ప్రయాణికులకు ప్రయాణంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఎస్సై వినోద్‌బాబు గురువారం తెలిపారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తే సుఖవంతమైన ప్రయాణం, ప్రమాద రహిత ప్రయాణ చేయవచ్చని తెలిపారు. అలాగే గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా ఉండాలి, లేకుంటే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై వినోద్‌బాబు తెలిపారు. వినాయక విగ్రహాలు, మండపాలను అందరి సహకారంతో ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకునేవారు ముందుగా పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, విద్యుత్ శాఖ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డీజే సౌండ్ సిస్టం రాత్రి 10 గంటల తరువాత వినియోగించవద్దని తెలిపారు. అశాంతి కలిగించే నినాదాలు పాటలు ప్రవర్తన పూర్తిగా నిషేధం అని, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నిమజ్జన సమయంలో క్రమశిక్షణ పాటించి పోలీసు సూచించి మార్గాలని పాటించాలని తెలిపారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేద్దాం



బోడవాడలో సమావేశం అయిన నియోజకవర్గ దళిత నాయకులు

పర్చూరు(చినగంజాం): దళితులంతా ఐక్యంగా ఉండి వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేద్దామని పర్చూరు నియోజక వర్గంలోని దళిత నాయకులు తీర్మానించారు. గురువారం బోడవాడలో రాయపూడి జాషువా తండ్రి సాల్మన్ సంస్మరణ కార్యక్రమానికి హాజరైన అనంతరం వారంతా సమావేశం అయ్యారు. దళితులంతా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు పాలెపోగు రాంబాబు, నూతలపాటి బలరాం, గర్నెపూడి రవిచంద్, కట్టా రత్నరాజు, కూరాకుల ఇస్సాక్, వంకాయలపాటి భాగ్యారావు, గేరా స్వరాజ్ కుమార్, మాచవరపు రవికుమార్, మున్నంగి వీరయ్య, శామ్యూల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్, ప్రింటర్ వితరణ



కంప్యూటర్‌ను హెచ్‌ఎంకు అందిస్తున్న దాత

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరిపట్నం లోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాత బట్ట రాంబాబు కంప్యూటర్, ప్రింటర్, స్కానర్‌ను బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మెడబలిమి శేఖర్‌రావు మాట్లాడారు. పాఠశాల అవసరాల నిమిత్తం కంప్యూటర్‌ను ఏర్పాటు చేయాలని కోరిన వెంటనే దాత స్పందించి రూ.40 వేల విలువైన కంప్యూటర్, ప్రింటర్, స్కానర్‌ను అందిస్తారని తెలిపారు. దాత పాఠశాలకు గతంలోనూ సహాయం అందించారని తెలిపారు.

డీలర్లు రెన్యువల్ చేయించుకోవాలి



రేషన్ డీలర్‌ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

ఇంకొల్లు(చినగంజాం): రేషన్ డీలర్లు రెన్యువల్ చేయించుకోకుంటే వెంటనే చేయించుకోవాలని తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్‌లతో సమావేశం నిర్వహించారు. రేషన్ డీలర్‌లు సరుకులు పంపిణీకి సంబంధించి 65 సంవత్సరాల వయస్సు కలిగిన కార్డుదారులకు, వికలాంగులకు ఆగస్టు 25 నుంచి రేషన్ కార్డుదారుని ఇంటి వద్దకు సకాలంలో రేషన్ పంపిణీ చేయాల్సిందిగా ఆదేశించారు. డీలర్‌ల లైసెన్స్‌లు త్వరగా రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. డీలర్‌లకు కార్డుల మ్యాపింగ్‌లో అనేక ఇబ్బందులున్నాయని, పోర్టబిలిటీ సదుపాయాలున్నందున రేషన్ కోటా మిగిలి పోతుందని కొందరు డీలర్‌ల కోటా తగ్గిపోతుందని తెలియజేశారు. ఈ విషయమై అర్జీ రూపంలో ఇచ్చిన వాటిని పరిశీలించి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాల్నారు. సమావేశంలో డీటీ లక్ష్మీ కుమారి, 41 మంది రేషన్ డీలర్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం వీబీఆర్‌వైని ప్రోత్సహించండి

బల్లికురవ: ప్రధానమంత్రి విక్షిత్ భారత్ రోజ్‌గార్ యోజనలో యాజమాన్యాలు కొత్త ఉద్యోగులను నియమించుకోవాలని గుంటూరు ప్రావిడెంట్ ఫండ్ అదనపు కమిషనర్ వీరభద్ర స్వామి వెల్లడించారు. గురువారం సాయంత్రం బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో క్వారీ యాజమాన్యాలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వివిధ సంస్థల ఉద్యోగులు, యజమానుల ప్రయోజనం కోసం ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ కొత్తగా పీఎం వీబీఆర్‌వై ప్రవేశ పెట్టిందని దీనిపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కొత్త ఉద్యోగులను నియమించుకోవడానికి ఆర్థిక ప్రయోజనాలను అందించటం ద్వారా కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించటానికి యజమానులను ప్రొత్సహించటం లక్ష్యమన్నారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి 2029 జూలై 31 వరకు పథకం అమల్లో ఉంటుందని కమిషనర్ వివరించారు. జిల్లా ప్రావిడెంట్ ఫండ్ ఇన్‌స్పెక్టర్ పఠాన్ ఇలియాస్, వెంకన్నబాబు క్వారీ అసోషియేషన్ అధ్యక్షుడు సురేష్ మాట్లాడారు.



బల్లికురవలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్

ఫెడరేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



జిల్లా కమిటీ నూతన కార్యవర్గం

చీరాల అర్బన్: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంఘం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా పెనుమాక ఆదాము, ప్రధాన కార్యదర్శిగా గుంటగాని ఇమ్మానియేల్, కోశాధికారిగా వి.రత్నబాబులతో పాటు కమిటీ ఉపాధ్యక్షులుగా చిమట వీరాస్వామి, డి.ప్రభాకర్, జి.కోటేశ్వరమ్మ, జి.కోటేశ్వరమ్మ, యు.సామెల్, కార్యదర్శులుగా వై.సింగయ్య, నూతలపాటి రాజు, బత్తుల విశ్వేశ్వరరావు, ఎం.అంకారావు, దాసరి అలివేలుతో పాటు 11 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఏపీ మున్సిపల్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సామ్రాజ్యం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వసంతరావు, చీరాల సీఐటీయూ అధ్యక్షుడు ఎన్.బాబూరావు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

వేటపాలెం: అక్కాయిపాలెం పంచాయతీ మోహన్ రావు కాలనీలో ప్రిపేర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ ఎం. రాజేష్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు వారి పిల్లలు అండగా ఉండాలని సూచించారు. సీనియర్ సిటిజన్‌లకు అనేక ప్రభుత్వ పథకాలు ఉన్నాయని సూచించారు. పోషక విలువతో కూడిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం పౌష్టికార ప్యాకెట్‌లను అందజేశారు. ఎం. వెంకటేశ్వర్లు, ఎస్వీ రమణా రెడ్డి, దేవమని, స్వాతి, రాజకుమారి, నాగజ్యోతి, శ్రీలేఖ, మెర్సి, పావని, మయూరి, హెప్సిబా, మంజుల పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన ఉండాలి



రీ సర్వేపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

ఇంకొల్లు(చినగంజాం): భూముల రీ సర్వేకు సంబంధించి అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ అన్నారు. గురువారం రీ సర్వేకు సంబంధించి రెవెన్యూ అధికారులకు సూచనలు అందజేశారు. రీ సర్వేకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఎస్ఓపీలో గల అంశాలు అమలు పరచే విషయమై సమగ్ర అవగాహన కల్పించారు. రీ సర్వే జరగనున్న ఇంకొల్లు, దుద్దుకూరు, పావులూరులోని విలేజ్ రెవెన్యూ అధికారులు, విలేజ్ సర్వేయర్‌లకు అవగాహన కల్పించారు. రీ సర్వే డీటీ భాగ్యరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణానికి ముప్పు కలిగించవద్దు



వైవీ రమణయ్య
ఇంకొల్లు సీఐ

ఇంకొల్లు(చినగంజాం): పర్యావరణానికి ముప్పు కలిగించే పీఓపీతో రూపొందించిన వినాయక విగ్రహాలను కాకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య సూచించారు. ఇంకొల్లు సర్కిల్ పరిధిలోని మండలాల్లో ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాటించాల్సిన నియమ నిబంధనలను గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి గురువారం పలు సూచనలు చేశారు. వినాయక విగ్రహాలు ఏర్పాటుకు పోలీసు అనుమతి తీసుకోవాలని, ఉత్సవ కమిటీలు ఏర్పడి వివరాలు తెలియజేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా విగ్రహాలు ఏర్పాటు ఉండరాదని సూచించారు. అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖల అనుమతి తీసుకోవాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్‌లు ఉపయోగించాలన్నారు. ఇంకొల్లు, చినగంజాం, కారంచేడు ఎస్ఐలు శీలం రమేష్, జి. సురేష్. ఎస్కే ఖాదర్ బాషలను సంప్రదించి అనుమతులు తీసుకోవాలన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

చీరాల టౌన్: సీజనల్ వ్యాధులకు గురికాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని దేవాంగపురి గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్రీను సూచించారు. గురువారం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గుమ్మస్తాల కాలనీ, కృపానగర్, హస్తినాపురం, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ గ్రామంలోని నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి పంపిణీ చేసిన డస్ట్‌బిన్లను వినియోగించుకుని తడిచెత్త, పొడిచెత్తను వేరుగా నిల్వచేసి పారిశుద్ధ్య కార్మికులకు చెత్త బుట్టలను అందించాలన్నారు. సెక్రటరీ వెంట పంచాయతీ సిబ్బంది, కార్మికులున్నారు.

హ్యాండ్ వాష్‌తో ఆరోగ్యం పదిలం



హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

ఉప్పుటూరు(చినగంజాం): వ్యాధులకు దూరంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ హ్యాండ్ వాష్ తప్పనిసరిగా చేయాలని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ సూచించారు. ఉప్పుటూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఆయన హ్యాండ్ వాష్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం తినే ముందు పిల్లలకు ఆహారం తినిపించే ముందు, ఆహారం వండే ముందు, మల విసర్జన తరువాత 20 సెకండ్ల పాటు హ్యాండ్ వాష్ తప్పనిసరిగా చేయాలని తద్వారా అనేక రకాల అంటు వ్యాధులు ముఖ్యంగా శ్వాస కోశ, జీర్ణ వ్యాధులను 70 శాతం నిర్మూలించవచ్చునని తెలిపారు. హ్యాండ్ వ్యాష్ చేయడంలోని 7 పద్ధతులను తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త బాల శ్యామల, సీహెచ్ఓ శృతి, ఆశ వర్కర్‌లు మేరి, రత్నకుమారి పాల్గొన్నారు.

రెవెన్యూ సేవల్లో అలసత్వం తగదు

చీరాల టౌన్: రెవెన్యూ సేవలను సత్వరంగా అందంచడంతో పాటు ప్రజలకు జవాబుదారీతనంగా పని చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. గురువారం రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. రెవెన్యూ శాఖలో పని చేసే గ్రామ, మండల స్థాయి అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా నీటి తీరువా వసూళ్లను త్వరగా చేయడంతో పాటు వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన అర్జీలను విచారించి త్వరగా పత్రాలు మంజూరు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల వారీగా ఓటీఎస్ వివరాలు, పెండింగ్ అర్జీలపై విచారించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలని ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశించిన సమయానికి పూర్తి చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతీ అర్జీని స్వయంగా విచారించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది విధుల్లో అశ్రద్ధ వహించినా, అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఐలు సత్యం, శేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్ట్



నాయుడువారిపాలెంలో పేకాడుతున్న వారిని అరెస్ట్ చేస్తున్న ఎస్ఐ ఖాదర్ బాషా

కారంచేడు: గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న 11 మందిని దాడి చేసి పట్టుకున్నామని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. గురువారం మండలంలోని నాయుడువారిపాలెంలో పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. దాడిలో పేకాడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి సెల్ ఫోన్‌లు, రూ. 15,211 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు.